

నవభూమి

కరీంనగర్

అనుబంధం

24 అక్టోబర్,2024 గురువారం పేజీలు:4

www.epaper.navabhoomi.in


# ఎవరికి వారే

**కరీంనగర్)–నవభూమి:** రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఏర్పాటు చేయతలపెట్టిన ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనుంది. ఈ అంశంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా కొత్త చిచ్చును రాజేస్తోంది. విపక్ష ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్న నియోజకవర్గాల్లో కొత్త తలనొప్పులు తీసుకొస్తున్నాయి. ఈ నెల 19లోగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీలో సందడి నెలకొంది. కరీంనగర్ జిల్లాలో మాత్రం విచిత్ర పరిస్థితి నెలకొన్నది. కరీంనగర్, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజక వర్గాల్లో బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చొప్పదండి, మానకొండూర్ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఈ రెండు నియోజక వర్గాల్లో వారి నేతృత్వంలోనే గ్రామ, పట్టణ ప్రాంతాల ఇందిరమ్మ కమిటీల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఆయా నియోజక వర్గాల్లోని గ్రామాల్లో పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తలకు చోటు కల్పిస్తూ ఇందిరమ్మ కమిటీలను రూపొందించి జిల్లా ఇన్‌చార్జి మంత్రికి పంపిస్తున్నారు. కరీంనగర్‌లో పలు జాబితాలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్, హుజూరాబాద్ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కరీంనగర్‌లో ఎవరికి వారు యమునా తీరే అన్నట్లు నాయకులు వ్యవహరిస్తున్నారని పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇక్కడ ఎమ్మెల్యే విపక్ష పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ కమిటీల ఏర్పాటులో కీలకంగా ఉంటారని, ఆయన సూచనల మేరకే కరీంనగర్, హుజూరాబాద్ నియోజక వర్గాల్లో నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కమిటీలు రూపొందిస్తున్నట్లు సమాచారం. మంత్రి ప్రభాకర్ సూచన మేరకు రూపొందించిన జాబితాతోపాటు సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో పది సంవత్సరాలుగా క్రియాశీలంగా వ్యవహరిస్తున్న వారి పేర్లతో 60 డివిజన్ల కమిటీలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డికి అందజేసినట్లు తెలిసింది. నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ తన అనుచరులతో జాబితా రూపొందించి వారికి ఇందిరమ్మ కమిటీల్లో చోటు కల్పించాలని కోరినట్లు సమాచారం.ఎవరి జాబితాలు ఆమోదం పొందుతాయో..హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సఖ్యతగానే ఉంటారు. ఆయన రూపొందించిన జాబితాలు ఆమోదం పొందే అవకాశం ఉంది. కరీంనగర్ కార్పొరేషన్‌కు వచ్చే సరికి పరిస్థితి మారిపోయింది. ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే వరకు కూడా కాంగ్రెస్ ఉనికి ఈ నియోజక వర్గంలో పెద్దగా లేదు. సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలు మినహా ఎక్కడా కార్యక్రమాలు నిర్వహించలేదు. కాంగ్రెస్‌లో ఉన్న నేతలంతా బీఆర్ఎస్‌కు ఇతర పార్టీలకు వలస పోయారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 11 మంది కార్పొరేటర్లు, 10 మంది మాజీ కార్పొరేటర్లు, మరికొందరు సీనియర్ నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ చేరికలతో పార్టీ కొంత క్రియాశీలకంగా మారినా.. వీరితోనే కొత్త తలనొప్పి మొదలయింది. ఇప్పటికే మంత్రి సూచన మేరకు ఒక జాబితా, సుడా చైర్మన్ ఆధ్వర్యంలో మరో జాబితా సిద్ధం కాగా కొత్తగా పార్టీలో చేరిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తమ తమ డివిజన్లలో తమ అనుచరులతో ఇందిరమ్మ కమిటీలను రూపొందించి ఆ జాబితాలను ఆమోదించాల్సిగా కోరుతూ ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చి తమ అనుచరులతో కమిటీలు ఏర్పాటు చేస్తే మొదటి నుంచి పార్టీలోనే ఉండి అధికారంలో లేనప్పుడు కష్టపడ్డ వారి పరిస్థితి ఏమిటని అసలు కాంగ్రెస్ వాదులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్, హుజూరాబాద్ నియోజక వర్గాల్లో ఇందిరమ్మ కమిటీలను తమ కార్యకర్తలతో రూపొందించి జిల్లా యంత్రాంగానికి అందజేయాలని నిర్ణయించారని తెలిసింది. ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేయడంలో క్రియాశీల పాత్ర వహిస్తాయి. సామాజిక తనిఖీలు చేసే అధికారాన్ని కలిగి ఉంటాయి. దీంతో ఈ కమిటీలకు రాజకీయంగా అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. కమిటీల్లో చోటు దక్కించుకోవడానికి కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీల చుట్టు తిరుగుతూ ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ నెల 19న జిల్లా జిల్లా నుంచి రూపొందించిన జాబితాలు అందిన తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రి కమిటీలను ప్రకటిస్తారు. అప్పుడు ఏ కమిటీలు ఆమోదముద్ర పొందుతాయో, ఎవరి సిఫారసులు పనిచేశాయో తెలిసే అవకాశం ఉంటుంది.

## అమ్మ భాషలో

# ఆణిముత్యాలు

**మెట్‌పల్లి –నవభూమి:** పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీలేదని నిరూపిస్తున్నారు ఈ అక్కాచెల్లెళ్లు..తండ్రి ఆశయం మేరకు తెలుగుపై మక్కువ పెంచుకున్న వీరు ఒకేసారి డాక్టరేట్ సాధించి ప్రశంసలు అందుకుంటున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని బుక్కవాడకు చెందిన వైద్యుడు వేముల శ్రీనివాస్–సాయిసుధ దంపతుల కుమార్తెలు శరణ్య, హర్షితకు చిన్నప్పటి నుంచే తెలుగు భాషపై మక్కువ. హైదరాబాద్‌లోని కేంద్రియ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు టాపర్స్‌గా నిలిచి శరణ్య, హర్షిత బంగారు పతకాలు సాధించారు. ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా తెలుగులో ఒకేసారి డాక్టరేట్ అందుకున్నారు.డిగ్రీ కళాశాల అధ్యాపకురాళు ్లగా ఒకేసారి ఉద్యోగాలు సాధించిన వీరు ప్రొఫెసర్లు కావడమే తమ లక్ష్యమంటున్నారు.శరణ్య 1 నుంచి 10వ తరగతి వరకు మెట్‌పల్లిలో, ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ సంస్కృతాంధ్ర కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివి 5 ఏళ్ల పాటు మొదటి ర్యాంకు సాధించారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో మొదటి స్థానం సాధించి మెరిట్ బంగారు పతకం, డిగ్రీ స్థాయిలో సంస్కృతంలో అత్యధిక మార్కులు పొంది రెండో బంగారు పతకం సొంతం చేసుకున్నారు. హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగులో నాలుగు సెమిస్టర్లలో మొదటి స్థానంలో నిలిచి విశ్వవిద్యాలయం పరిధిలో ఉమెన్ టాపర్‌గా నిలిచి 2013లో అప్పటి గవర్నర్ చేతుల మీదుగా మెరిట్ బంగారు పతకం అందుకున్నారు.తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లల మర్రి రాములు వద్ద శ్రీనాథుని కవితా ప్రస్థానం సమగ్ర పరిశీలన అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేయడంతోపాటు కవితలు, పాటలు రాసి అవార్డులు అందుకున్నారు. పలు టీవీ ఛానళ్లలో తెలుగుపై చర్చా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు జాతీయ సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. 2019లో గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించిన ఆమె ఇటీవల గవర్నర్ చేతుల మీదుగా తెలుగులో డాక్టరేట్ పట్టా అందుకున్నారు.హర్షిత 10వ తరగతి వరకు మెట్‌పల్లిలో చదివి మండల టాపర్‌గా నిలిచి ఐఐఐటీ బాసరలో సీటు సాధించారు.తెలుగు భాషపై మక్కువతో ఐఐఐటీ సీటును వదిలేసి అక్క నడిచిన మార్గంలోనే ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహ సంస్కృతాంధ్ర కళాశాలలో ఇంటర్, డిగ్రీ చదివి టాపర్‌గా నిలిచారు. హైదరాబాద్ కేంద్రియ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగులో నాలుగు సెమిస్టర్లలో టాపర్‌గా నిలిచి 2016లో మూడు మెరిట్ మెడల్స్‌ని కైవసం చేసుకున్నారు. ఇదే విశ్వవిద్యాలయంలో సాహిత్య వ్యాసాలు విమర్శనాత్మక అధ్యయనం అనే అంశంపై ఆచార్య దార్ల వేంకటేశ్వరరావు వద్ద పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2019లో తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించిన ఆమె తాజాగా తెలుగులో గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా తీసుకున్నారు.



## శాశ్వత రహదారి

# నిర్మించేదెప్పుడు?



## ముగిసిన గంగుల నర్సమ్మ అంత్యక్రియలు



**కరీంనగర్:-నవభూమి:** మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాతృమూర్తి అంత్యక్రియలు ముగిశాయి. గంగుల కమలాకర్ తల్లి గంగుల నర్సవ్వ సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈ మేరకు బుధవారం కరీంనగర్‌లో అంతిమయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ పమేలా సత్పతి, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిలు పాల్గొన్నారు. గంగుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భారాస నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిమ్మచీకటిలో ఈత చెట్టు కింద 15 గంటలు

**కమాన్‌పూర్, -నవభూమి:** కల్లు గీసేందుకు ఈత చెట్టు ఎక్కిన గీతకార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి 15 గంటల పాటు నరకయాతన అనుభవించిన ఘటన కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఏగోలపు నర్సయ్యగౌడ్ సోమవారం సాయంత్రం ఈత చెట్టుపై నుంచి కింద పడ్డారు. వెన్నెముక, ఇతర అవయవాలకు బలమైన గాయాలయ్యాయి. చుట్టూ దట్టమైన చెట్ల పొదలుండటం, ఎవరూ చూడకపోవడంతో నర్సయ్యగౌడ్ లేవలేని స్థితిలో అక్కడే ఉండిపోయారు. భారీ వర్షం కురవడంతో తడుస్తూ ఆర్తనాదాలు చేసినా ఫలితం లేకపోయింది. భార్య సరమ్మ అల్లూరులో ఉంటున్న కొడుకు ఇంటికి వెళ్లడంతో ఒంటరిగా ఉన్న నర్సయ్య ఇంటికి రాని విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. రాత్రంతా వర్షానికి తడిసి చలిలో, గాయాల బాధతో విలవిలలాడారు. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో అటువైపు వెళ్లిన గ్రామస్థులకు నర్సయ్యగౌడ్ అరుపులు వినిపించడంతో వెళ్లి చూశారు. గోదావరిఖని ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు, అనంతరం వరంగల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వెన్నెముక, పక్కటెముకలకు బలమైన గాయాలు కావడంతో నర్సయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.



# కొన్నారు..మూలన పెట్టారు





**జగిత్యాల -నవభూమి:** చెత్త సేకరణ వాహనాల వినియోగంలో బల్దియా నిర్లక్ష్యం ఇక్కడ కనిపిస్తున్న 4 కొత్త ఆటోలను రూ.25 లక్షల వ్యయం చేసి బల్దియా 2 నెలల కిందట కొనుగోలు చేసింది. ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్ పూర్తయినా 2 నెలలుగా విద్యానగర్ నీళ్లట్యాంకు వద్దే ఉంచారు. పట్టణంలో ఓవైపు చెత్త సేకరణ లేక కాలనీలు కంపు కొడుతుంటే కొనుగోలు చేసిన వాహనాలను పక్కనపెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. స్థానిక 45వ వార్డులో పారిశుద్ధ్య సిబ్బంది వారం రోజులుగా చెత్త తొలగించలేదు. దసరా పండగపూట కాలనీవాసులు దుర్గంధంతో విసిగిపోయారు. కారణమేంటని కాలనీవాసులు ఆరా తీస్తే ఈ వార్డుకు చెందిన వాహనం 2 నెలలుగా మరమ్మతులో ఉందని పురపాలక సిబ్బంది తెలిపారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసినా వార్డులకు కేటాయించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ చిత్రంలో ముసుగుకప్పి కనిపిస్తుంది కొత్త ట్రాక్టరు. చెత్త సేకరణ కోసం రూ.14 లక్షలు వెచ్చించి బల్దియా ఏడాది కిందట దీన్ని కొనుగోలు చేసింది. షోరూం నుంచి తెచ్చి విద్యానగర్ నీళ్లట్యాంకు వద్ద చెట్టుకింద ఇలా నిలిపారు. పురపాలిక అధికారుల నిర్లక్ష్యంతో సంవత్సరం నుంచి వినియోగానికి దూరమై తుప్పుపడుతోంది. జగిత్యాల పట్టణంలో 48 వార్డుల నుంచి నిత్యం 70 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. వార్డుల విలీనం తరువాత గృహాల సంఖ్య పెరగటం, కాలనీలను విస్తరించడంతో చెత్త సేకరణ బల్దియాకు సవాలుగా మారింది. వాహనాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆటోలు, ట్రాక్టర్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. దీంతో బల్దియా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షలతో ఏడాది క్రితం ట్రాక్టరును.. రెండు నెలల కింద రూ.25 లక్షలతో 4 కొత్త ఆటోలను కొనుగోలు చేశారు. వీటిని వెంటనే ప్రారంభించి వినియోగించాల్సిన అవసరం ఉన్నా.. నిర్లక్ష్యంతో పక్కన పెట్టేశారు. మరమ్మతులపైనే శ్రద్ధ పురపాలిక అధికారులకు మరమ్మతులపై ఉన్న శ్రద్ధ వాహనాల నిర్వహణపై లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదికి రూ.20 లక్షల చొప్పున మరమ్మతులకు వ్యయం చేస్తున్నారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనే డిమాండ్ రెండేళ్లుగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహించారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడటం.. సభ్యుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో కొత్త వాహనాలు కొనుగోలు చేసినా మరమ్మతుల యావలోపడి వీటి నిర్వహణ మరిచారు. ప్రస్తుతం 15 ఆటోలు మరమ్మతు కోసం నెలల తరబడి మెకానిక్ షెడ్లలో మగ్గుతున్నాయి. తరచూ కమిషనర్లు మారటం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు సిబ్బంది మరమ్మతుల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఎక్కడి చెత్త అక్కడే.. వాహనాలు పాడైపోయాయని.. కొత్త వాహనాలు లేవనే కారణాలతో పారిశుద్ధ్య సిబ్బంది వార్డుల్లో చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించడం లేదు. మొరాయిస్తున్న వాహనాలతోనే సామర్థ్యానికి మించి చెత్త సేకరిస్తున్నామని కొందరు పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు. వార్డుల్లో కనీసం వారం రోజులకోసారి కూడా చెత్త సేకరణ చేపట్టకపోవడంతో పలు కాలనీల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. తీవ్రమైన జ్వరాల బారిన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా అధికారులు కనీసం దోమల నివారణ మందు కూడా చల్లడం లేదు. సమస్యల పరిష్కారానికి పురపాలిక సభ్యులు స్పందించాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

# సాగునీటి సమస్యలకు చెక్!

**ధర్మపురి:-నవభూమి:** ఏళ్ల తరబడి సాగునీటి రంగంలో క్షేత్రస్థాయి సిబ్బంది లేక చివరి ఆయకట్టుకు నీరందించడం గగనంగా మారింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టాలని భావిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన ప్రకటనతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఓ వైపు జిల్లాలో గోదావరి ఎత్తిపోతల పథకాలు, రోళ్లవాగు ప్రాజెక్టు, అక్కపల్లి చెరువు రిజర్వాయర్, బోలిచెరువు, జంగనాల ప్రాజెక్టు, యశ్వంతరావుపేట ప్రాజెక్టు లాంటివి ఉండటం.. మరోవైపు డీ-53, డీ-86 ప్రధాన కాలువలు ఉన్నాయి. వీటి కింద లక్ష ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. పిచ్చి మొక్కలతో కాలువలు కాలువల ద్వారా నీటిని వదిలిన సమయంలో అవి పూడికతో, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో ఏటా చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. గోదావరి ఎత్తిపోతల పథకాలు నూతనంగా నిర్మించడంతో వీటి కింద 20 వేల ఆయకట్టు పెరిగింది. ఈ పథకాలకు క్షేత్రస్థాయి సహాయ సిబ్బంది లేక నిర్వహణకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా రైతులు సమష్టిగా పథకాలను బాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నూతన నియామక ప్రక్రియ రైతులకు దోహద పడనుంది. 120 మందితో ప్రతిపాదనలు



గోదావరి ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లకు ఎంతమంది ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, పంపు మెకానిక్‌లు అవసరమో ప్రతిపాదించాలని ప్రభుత్వం ఇటీవల ఇరిగేషన్ అధికారులకు లేఖలు ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ద్వారా పంపించింది. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో అన్ని పథకాలకు కలిపి 120 మంది వరకు అవసరం ఉంటారని నివేదించారు. ప్రకటనతో అన్నదాతల హర్షం ప్రభుత్వం 22 జులై 2016న నీటిపారుదల శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకుంటే ప్రధాన కాలువపై ప్రతి 9 కి.మీ.కి ఒకరు, ఉప కాలువపై ప్రతి 112 కి.మీల వరకు మరొకరు, డిస్ట్రిబ్యూటర్‌పై ప్రతి 2,500 ఎకరాల ఆయకట్టుకు లస్కర్లు ఉండాల్సి ఉండగా అమలు కావడం లేదు. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన, ప్రభుత్వం ప్రతిపాదనలను కోరడం నీటి పారుదల నిర్వహణలో నెలకొన్న దశాబ్దాల సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారు. ఆదేశాలకు అనుగుణంగా చర్యలు సాగునీటి రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు వేస్తుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొత్తగా లస్కర్లు, సహాయకుల నియామక ప్రక్రియకు సంబంధించిన ప్రతిపాదలను ప్రభుత్వానికి నివేదించాం. వీరిని నియమిస్తే సాగునీటి సరఫరా సమస్యలు చాలా వరకు తగ్గే అవకాశముంది.

## ఇళ్లు ఇచ్చారు... వసతులు మరిచారు

**సిరిసిల్ల –నవభూమి:** గూడు లేని నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి పంపిణీ చేశారు.పనుల్లో నాణ్యత లేక ఇటీవల కురిసిన వర్షాలకు గోడలకు తడి వస్తుంది. కింది బ్లాక్‌లో ఉన్న ఇళ్లలోకి వరద రావడం, రాత్రి వేళ విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య సమస్య, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో కేసీఆర్ నగర్ వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో సిరిసిల్ల పురపాలక సంఘం పరిధిలోని అర్హులైన లబ్ధిదారుల కోసం 1,220 రెండు పడక గదుల ఇళ్లు నిర్మించారు. మండెపల్లికి చెందిన మరో 80 మందికి ఇక్కడే నిర్మించి పంపిణీ చేశారు. ఈ కాలనీకి కేసీఆర్‌నగర్‌గా నామకరణం చేశారు.కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రస్తుతం సగానికి పైగా లబ్ధిదారులు ఇళ్లను ఖాళీ వెళ్లిపోయి సిరిసిల్లలో అద్దెకు ఉంటున్నారు. ఉన్న సగం మంది సమస్యలతో సతమతమవుతున్నారు.ఎవరైనా చనిపోతే కనీసం శ్మశానవాటిక లేదు.పారిశుద్ధ్య నిర్వహణ లేకపోవడంతో చెత్తాచెదారాన్ని కాలనీవాసులు రహదారికి ఇరువైపులా పడేయడంతో దుర్వాసన వస్తోంది.ఈ కాలనీకి కేవలం మిషన్ భగీరథ నీరే ఆధారం. ఆ నీరు రాకపోతే స్థానికులు నానా పాట్లు పడాల్సి వస్తుంది.నిర్వహణ ఎవరిది? కేసీఆర్‌నగర్‌లో కనీస మౌలిక వసతులు కల్పించే బాధ్యతను మొన్నటి వరకు వరకు చేపట్టిన మున్సిపల్ అధికారులు రెండు నెలల క్రితం చేతులు ఎత్తేశారు. దీంతో కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వారితో మాట్లాడి తాత్కాలికంగా తంగళ్లపల్లి ఎంపీడీవో లక్ష్మీనారాయణకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడంతో సమస్యల పరిష్కారం ప్రశ్నార్థంగా మారింది. చాలా రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళలో పాములు వస్తుండటంతో బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. మూడో అంతస్తుకు నీళ్లు రాకపోవడంతో కింది నుంచి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రహదారి పక్కన వేసిన చెత్తాచెదారం పంచాయతీగా ఏర్పాటు చేయాలి మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. అధికారులు వసతులు కల్పించాలి. ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలి. కేసీఆర్‌కాలనీని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి.కట్ట రవి, కేసీఆర్‌నగర్ పారిశుద్ధ్య నిర్వహణ లేదు ఇక్కడ పారిశుద్ధ్య నిర్వహణ లేదు. ఇళ్ల ముందు భాగం, మధ్యలో గడ్డి పెరిగి పాములు, తేళ్లు, విష పురుగులు వస్తున్నాయి. చీకటి వల్ల రాత్రి పూట బయటకు రాలేకపోతున్నాం. బ్లాక్‌లో మూడో అంతస్తులో ఉన్న వారు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.బల్ల కవిత, స్థానికురాలు అన్ని చర్యలు తీసుకుంటాం తంగళ్లపల్లి మండలంలోని కేసీఆర్‌నగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ నీరు సరఫరాలో సమస్య ఏర్పడినప్పుడు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరిస్తాం.





## చెంజర్ల గడ్డ..ఉద్యోగుల అడ్డా

**మానకొండూర్:–నవభూమి:** గతంలో కరవు కాటకాలతో సతమతమైన గ్రామం అది. ప్రస్తుతం గురువులకు నిలయంగా మారింది.తలాపున కాకతీయ కాలువ ప్రవహిస్తున్నా ఆ పల్లెకు చుక్క నీరు అందడం లేదు. సాధారణ కుటుంబాలు కావడంతో చదువుతోనే భవిష్యత్తు బాగుపడుతుందని పెద్దలు తలచారు. ముందుగా ఆరుగురు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. వారి స్ఫూర్తితో అదే ఉద్యోగాన్ని సాధించాలని మరికొంత మంది దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. ప్రస్తుతం ఒక తరాన్ని ప్రభావితం చేయగలిగిన గురువులు ఈ ఊరి సొంతం. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 70 మంది ఉపాధ్యాయులు ఆ గ్రామంలో ఉండడం విశేషం.మానకొండూర్ మండలంలోని చెంజర్ల గ్రామంలో 3,067 మంది జనాభా ఉంది. నీటి సదుపాయం లేకపోవడంతో ఆశించిన మేర వ్యవసాయం సాగలేదు. దీంతో పలు కుటుంబాలు జీవనోపాధి కోసం ముంబయి, భీవండి, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ఈ క్రమంలోనే తమ భవిష్యత్తుపై ఆందోళన చెందిన స్థానిక యువత.. చదువుపై దృష్టి సారించింది. మొక్కవోని దీక్షతో.. ఉజ్వల భవిష్యత్తుపై ఆశతో.. ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో చదువులు కొనసాగించారు. 2006 డీఎస్సీలో గ్రామం నుంచి ఒక్కసారే ఆరుగురు ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందారు. ఈ పరిణామం గ్రామంలోని పలువురిని ఉపాధ్యాయ వృత్తి వైపు మళ్లించేలా చేసింది. వారి ఆసక్తికి.. స్థానిక ప్రైవేట్ ఉపాధ్యాయుడు ఆంజనేయులు, మార్కండేయ, శ్రీనివాస్‌ల ప్రోత్సాహం తోడైంది. వారు ఇచ్చిన సూచనలను సద్వినియోగం చేసుకున్న 18 మంది అభ్యర్థులు 2012 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికై అరుదైన ఘనత సాధించారు. ఒకే గ్రామం నుంచి అంతమంది ఉద్యోగానికి ఎంపికైన దాఖలాలు రాష్ట్ర చరిత్రలోనే లేవు. అదే స్ఫూర్తితో ప్రతీసారి ఈ గ్రామం నుంచి ఉపాధ్యాయులుగా ఎంపిక అవుతూనే ఉన్నారు. తాజా డీఎస్సీలోనూ ఒక్క పీఈటీ, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ఆరుగురు ఎస్జీటీలు ఎంపికవడం గమనార్హం. వీరితోపాటు గ్రామంలో 17 మంది కానిస్టేబుళ్లతోసహా ఇతర విభాగాల్లోనూ ఉద్యోగులు ఉండటం విశేషం.వృత్తిపై మమకారం ప్రాథమిక విద్య నుంచే ఉపాధ్యాయ వృత్తిపై మమకారం పెరిగింది. ఉపాధ్యాయుడిగా ఎంపికై పలువురిని ప్రయోజకులుగా తయారు చేయాలని ఉండేది. 2012 టెట్‌లో రాష్ట్ర స్థాయిలో 1వ ర్యాంకు సాధించాను. స్కూల్ అసిస్టెంటుగా ఎంపిక కావడం ఎంతో సంతోషం కలిగించింది. ఇటీవల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఆంగ్ల అధ్యాపకుడిగా ఎంపికయ్యాను. టీటీసీ తరగతులు నిర్వహిస్తూ ఉపాధ్యాయ వృత్తిలోకి ఎంపికయ్యేలా సహాయం చేస్తున్నాను.బైరి మార్కండేయ, జూనియర్ లెక్చరర్ సీనియర్ల స్ఫూర్తితో..సీనియర్ ఉపాధ్యాయుల స్ఫూర్తితో నేను కూడా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివాను. బీఈడీ పూర్తి చేసి అనుకున్నది సాధించాను. కొన్నాళ్లపాటు మా గ్రామంలోని ఉన్నత పాఠశాలలోనే పని చేయడం ఎంతో సంతృప్తిని కలిగించింది. నా భార్య కూడా ఉపాధ్యాయురాలే. ఎవరైనా ఏదైనా అనుకుంటే అది సాధించే వరకూ ప్రయత్నిస్తూ ముందుకు సాగాలి.



## శాశ్వత రహదారి నిర్మించేదెప్పుడు?

**రామడుగు:–నవభూమి:** రామడుగులోని మోతె వాగుపై కొత్త వంతెన అందుబాటులోకి వచ్చినా..ఇంకా పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం కాలేదు. నెల రోజుల కిందట భారీ వర్షాలకు పాత వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎమ్మెల్యే మేడపల్లి సత్యం కల్పించుకొని భూనిర్వాసితులను ఒప్పించి.. కొత్త వంతెనపై నుంచి తాత్కాలిక రాకపోకలు సాగేలా చూశారు. అటు వైపు వెళ్లే వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డుకు తాత్కాలికంగా మొరం పోయడంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. శాశ్వత రహదారి పనులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.సవరణ ప్రతిపాదనలు..2019లో రూ.7.9 కోట్లతో చేపట్టిన వంతెన పనులు 2023లో పూర్తయినా.. అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో వృథాగా ఉండిపోయింది. ఇరువైపులా భూసేకరణ చేపట్టి రోడ్డు పనులు చేపట్టాల్సి ఉండగా సవరణ ప్రతిపాదనలు రూపొందించారు. మొత్తం రూ.11.20 కోట్లతో నిధులు ప్రతిపాదించారు. భూనిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించకున్నా ఒప్పించారు. మొరం పోసి తాత్కాలిక రహదారి వేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొత్త వంతెనను ప్రారంభించారు. అప్పటి నుంచి దానిపై నుంచి రాకపోకలు మొదలయ్యాయి.తారు రోడ్డు నిర్మించాలి కొత్త వంతెన వద్ద కేవలం మట్టి పోసిన రోడ్డు కావడంతో భారీ వాహనాలు దిగబడుతున్నాయి. వర్షాలు కురిస్తే మరింత ఇబ్బంది ఏర్పడుతుంది. రోలర్‌తో చదును చేసి కంకర పోసిన అనంతరం తారు రోడ్డు నిర్మిస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదు. కొన్నేళ్లుగా పాత వంతెనతో ఇబ్బందిపడ్డాం. ఇప్పుడు తాత్కాలికంగా సమస్య పరిష్కారమైనా.. శాశ్వత పనులు చేపట్టాలి.బొడ్ల శ్రీధర్, రామడుగు వాహనాలు వెళ్లడం ఇబ్బందిగా ఉంది రామడుగు కొత్త వంతెన వద్ద ఇరువైపులా ద్విచక్ర వాహనాలు సైతం సరిగా వెళ్లలేకపోతున్నాయి. కేవలం మట్టి నింపడంతో సమస్యగా మారింది. పూర్తి స్థాయి రోడ్డు నిర్మిస్తే అన్ని వాహనాలు సజావుగా వెళ్తాయి. అధిక సామర్థ్యం ఉన్న పెద్ద వాహనాలు దిగబడుతున్నాయి. కొత్త వంతెన బాగున్నా ఇరువైపులా రోడ్డు బాగాలేదు.

